ప్రజాదర్బార్

తెలుగు దినపత్రిక

జిల్లా అనుబంధం

శుక్రవారం,మే, 01,2026

పేజీలు : 8


## భూదేవి నగర్‌లో బాక్స్ డ్రైన్ పనుల పరిశీలన

అల్వాల్: 194 భూదేవి నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మారుతి నగర్ నుంచి సాయి దత్త కాలనీ వరకు పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. రోడ్డు కటింగ్ ద్వారా కాలువ నిర్మాణం చేసి, అడుగు భాగంలో కాంక్రీట్ వేయడం వల్ల వర్షపు నీరు, మురుగు నీరు సాఫీగా ప్రవహిస్తాయని పేర్కొన్నారు. పనులను యుద్ధ ప్రాతిపదికన త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. అరుణ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, డివిజన్ అధ్యక్షుడు మల్లెల శివతో పాటు పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు జిల్లా కలెక్టర్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజా దర్బార్) నాగర్ కర్నూల్ జిల్లాలోమొక్కజొన్న కొనుగోలుపై మార్క్ ఫైడ్, పౌరసరఫరాల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సమావేశం నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా,పారదర్శకంగానిర్వహించేందుకు జిల్లా పరిపాలన చర్యలు ముమ్మరం చేసింది ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన మొక్కజొన్నను వేగంగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ శాతం పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న 18 జిన్నింగ్ మిల్లుల్లో మొక్కజొన్నను కొనుగోలు చేసి నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిల్వ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గిడ్డంగులు సరిపోకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమయానికి తరలించకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకు రవాణా ఏర్పాట్లను ముందుగానే సిద్ధంచేసుకోవాలని సూచించారు.రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా అవకతవకలు లేదా నిర్లక్ష్యం చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పెంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## పోచారంలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

పరకాల ప్రజాదర్బార్ ఏప్రిల్ 30: పరకాల మండలం పోచారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రజలకు తమ ప్రాథమిక హక్కులు మరియు బాధ్యతలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ మరియు ఆర్ఐ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, సమాజం పట్ల తమకున్న బాధ్యతలను విస్మరించ కూడదని సూచించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను పాటించడం ద్వారానే సమాజంలో శాంతి,సామరస్యాలు నెలకొంటాయని వారు ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామస్థులంతా ఐకమత్యంతో ఉంటూ, ఒకరినొకరు గౌరవించుకుంటూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువత మరియు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్





వికారాబాద్ జిల్లాప్రతినిధి,ఏప్రిల్30(ప్రజాదర్బార్)అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని బురాన్ పల్లి గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడు తూ...రాష్ట్రంలోని అర్హులైన ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు ఇండ్లు నిర్మించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఇందిరమ్మ మంజూరు చేయడం జరిగిందని,వాటిని ఇప్పటికే నిర్మాణం జరిగాయని అన్నారు. రెండవ విడతలో మళ్ళీ ఇందిరమ్మ ఇండ్లు పెద్ద ఎత్తున్న నియోజకవర్గానికి తీసుకువస్తామని అన్నారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నూతనంగా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్న వారికి బట్టలు(బహుమతి) పెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి,వికారాబాద్ ఏఎంసి ఛైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్,వైస్ చైర్మన్ పిలారం మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి,జాఫర్,ఎంపిడిఓ వినయ్ కుమార్,హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చైర్మన్ భర్త, మామ, కుటుంబ సభ్యుల పెత్తనం

## - పాలనలో లోపించిన పారదర్శకత - 11 టెండర్లు ఒకరికే దక్కడంపై....- కాంగ్రెస్ కౌన్సిలర్ల అనుమానాలు- సిఎస్ఆర్ నిధులు మాకే దక్కాలి



పటాన్ చెరు, ఏప్రిల్ 30, (ప్రజాదర్బార్): కాలుష్యం మాకు.... సిఎస్ఆర్ కాసులు మీకా అంటూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వి.నారాయణదాసు, సంపత్ రెడ్డి, రాఘవేంద్ర, వెంకట్ నాయక్, సందీప్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, మనీ, గోపాల్ రెడ్డి, రవి లు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులు మా బల్దియాకే దక్కాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రాంత పరిశ్రమలకు చెందిన సిఎస్ఆర్ నిధులు... ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలన్నారు. ఇస్నాపూర్ లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... చైర్మన్ భర్త, మామ, కుటుంబ సభ్యుల పెత్తనం చాలా స్పష్టంగా కనిపిస్తుందని తీవ్రంగా ఆరోపించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ బల్దియా అభివృద్ధిని అడ్డుకోవద్దని వారు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో సైతం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, చైర్మన్ ల పెత్తనం స్పష్టంగా కనిపిస్తోందని ధ్వజమెత్తారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒంటెద్దు పోకడల వ్యవహరించిన టిఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం అదే రీతిలో ముందుకు సాగడం దారుణమన్నారు. ఇస్నాపూర్ బల్దియా అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, వ్యక్తిగత స్వార్ధాలతో రాజకీయాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని వారు హితవు పలికారు. 11 టెండర్ కాంట్రాక్టులు ఒకే వ్యక్తికి దక్కడంపై వారు పలు అనుమానాలను వ్యక్తం చేశారు. ఇస్నాపూర్ బల్దియాలో పారదర్శకత మచ్చుకైనా కనిపించడం లేదని తీవ్రంగా ఆరోపించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీగా అవతరించక ముందు జరిగిన కుంభకోణాలు, పాత తేదీలతో జరుగుతున్న నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బల్దియ అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని వారు పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు.

# --మండల కార్యాలయంలో మౌలిక సదుపాయాల కోసం వినతి

## కొందుర్గు మండల తహసీల్దార్ కార్యాలయంలో మౌలిక సదుపాయాల కోసం వినతి



కొందుర్గు ఏప్రిల్ 30(ప్రజాదర్బార్):- కొందుర్గు మండల తహసీల్దార్ (ఎంఆర్వో) కార్యాలయం ఆవరణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం షాద్‌నగర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా, కార్యాలయ ఆవరణలో బహిర్గతంగా మూత్రశాల నిర్మాణం చేపట్టడంతో పాటు, ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ అజీమ్ ఆలీని కోరారు. జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటేష్ నాయకత్వంలో ఈ వినతి కార్యక్రమం జరిగింది. మండల కార్యాలయానికి ప్రతి రోజు జిల్లా నలుమూలల నుండి వందలాది మంది ప్రజలు వివిధ అవసరాల కోసం వచ్చి గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు 3 నుండి 6 గంటల వరకు కార్యాలయంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో తాగునీరు మరియు మూత్రశాల వంటి ప్రాథమిక సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో వివరించారు. ఈ సమస్యలపై స్పందించిన తహసీల్దార్ అజీమ్ ఆలీ, వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కి వెంటనే పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతాపూర్ గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యుడు కాశ యాదయ్య గారు, బహుజన యువ నాయకుడు మీది కేరి రాధాకృష్ణ, కొందుర్గు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి సారిస్తూ చేసిన ఈ వినతి కార్యక్రమం స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. అధికారుల తక్షణ స్పందనతో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రైవేట్ వీడియోలతో బాలికలు, యువతుల్ని బ్లాక్ మెయిల్

హైదరాబాద్, : సోషల్ మీడియా వేదికగా చేసుకుని బాలికలు, యువతులను మోసం చేస్తున్న కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఖరీదైన కార్లు, పబ్‌లలో దిగిన ఫొటోలను చూపిస్తూ తాను రిచ్ ఫ్యామిలీకి చెందినవాడినని నమ్మించి చాటింగ్ ద్వారా అమ్మాయిలకు దగ్గరయ్యేవా డు. తరువాత ప్రేమ పేరుతో లోబరుచుకుని వారితో ఏకాంతంగా గడిపిన వీడియోలు, ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నట్లు గుర్తించారు. గడిచిన రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 20 మందికి పైగా యువతులను అర్జున్ మోసం చేసినట్లు తెలుస్తోంది. బాధిత యువతుల ఫిర్యాదుతో నిందితుడిపై మరో 3 కేసులు నమోదు చేశారు. మరో కేసును నార్సింగి పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై వినోద్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామళ్ల మూడికి చెందిన ఆజాద్ అలియాస్ అర్జున్ ప్రస్తుతం మియాపూర్‌లో ఉంటున్నాడు. ధనవంతుల ఇళ్లల్లో పనిచేసే డ్రైవర్స్, వాచ్‌మెన్, ఇతర సిబ్బందితో పరిచయం పెంచుకుని వారికి కొంత నగదు ఇస్తూ ఆ ఇంట్లోని బాలికలు, యువతుల్ని ట్రాప్ చేసేవాడు. నిందితుడు అర్జున్ కేవలం సోషల్ మీడియా చాటింగ్‌కే పరిమితం కాలేదు. బాలికలు, యువతులతో ఏకాంతంగా ఉన్న గడిపిన సమయంలో రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసేవాడు.

# పదవ తరగతి ఫలితాల్లో హిమ్మత్రావుపేట విద్యార్థుల ప్రతిభ



కొడిమ్యాల /జగిత్యాల/ ఏప్రిల్ 30 (ప్రజా దర్బార్) కొడిమ్యాల మండలంలోని హిమ్మత్రావుపేట గ్రామానికి చెందిన గుండేటి అనుదీప్ పదో తరగతిలో 567 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం పొందాడు. అలాగే శలేంద్ర రేవతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 479 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు వీరిని శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల కుటుంబాలు పేదవిగా ఉండి, గుంట భూమి కూడా లేకపోయినా వారి తల్లిదండ్రులు విదేశాల్లో కష్టపడుతూ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దినందుకు ప్రశంసించారు. గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.

# దేశంలో లక్షకు మించి పెట్రోల్ పంపులు

దేశీయంగా పెట్రోల్, డీజిల్ వినియోగానికి తగినట్లుగా, వాటి విక్రయ కేంద్రాల సంఖ్య అధికమవుతోంది. గత దశాబ్దకాలంలోనే దేశంలోని పెట్రోల్ పంపుల సంఖ్య రెట్టింపైందని చమురు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది నవంబరు చివరికి 1,00,266 పెట్రోల్ పంపులున్నాయని.. 2015లో ఈ సంఖ్య 50,451 మాత్రమేనని వెల్లడించింది. వాహన కొనుగోళ్లు భారీగా పెరిగినందున, గ్రామీణ ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల వెంబడి పెట్రోల్ పంపుల విస్తరణ అధికమవుతోంది. అమెరికా, చైనా తరవాత మనదేశమే అధికంగా పెట్రోల్ పంపులను కలిగిన దేశాల్లో అమెరికా (1,96,643), చైనా (1,15,228) తర్వాత మనదేశమే ఉంది. దేశీయంగా ప్రభుత్వరంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలోనే 90% పైగా పెట్రోల్ పంపులున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థల్లో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ అనుబంధ సంస్థ నయారా ఎనర్జీ లిమిటెడ్ 6,921, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ – బీపీ సంయుక్తంగా 2,114, షెల్ 346 పెట్రోల్ పంపులను నిర్వహిస్తున్నాయి. 2003–04లో 27 పెట్రోల్ పంపులతో మనదేశంలో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలు ఆరంభమయ్యాయి.

# వేసవి నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్య

## గ్రామసర్పంచ్ లాలాపేట బందయ్య, సొంత నిధులతో బోరు,మోటర్ ఏర్పాటు



షాబాద్ఏప్రిల్ 30 (ప్రజాదర్బార్) మన్ మర్రి గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మరో ముందడుగు పడింది. ఈరోజు దర్గా సమీపంలో ఉన్న బోరుబావికి 3 హెచ్‌పీ మోటారు అమర్చడం ద్వారా గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచడం జరిగింది. వేసవి కాలంలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా చేపట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో మన్ మర్రి గ్రామ సర్పంచ్ బంధయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. డిప్యూటీ సర్పంచ్ బేగరి శంకరయ్య మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ సెక్రటరీ శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుడిసె నరేష్, ఎర్రవల్లి రాజు, దండు నర్సింలు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ , గ్రామ పెద్దలు ఈడిగి యాదయ్య, కావలి యాదయ్య, గాలయ్య, రాజలింగం, పి. రాంరెడ్డి, పి. భూపాలరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దర్గా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ బోరు మోటారు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి దోహదపడతాయని, గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# నిరుపేద విద్యార్థికి లాప్‌టాప్ పంపిణీ


## - మానవత్వాన్ని చాటుకున్న సర్పంచ్ కాకులమర్రి శ్రీలత !;'జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు




ప్రజాదర్బార్, ఏటూరు నాగారం , ఏప్రిల్ 30: పేదరికం విద్యకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలవడమే తమ లక్ష్యమని ఏటు రూనగరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే ఏటూరు నాగారం మండలానికి చెందిన 5 వ,వార్డుకు చెందిన జాడి రాజు కుమార్తె జాడి రాధిక, నిరుపేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసిస్తున్నప్పటికీ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా లాప్‌టాప్ కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని సర్పంచ్ శ్రీలత లక్ష్మణ్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. నేటి ఆధునిక విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని గుర్తించిన వారు తక్షణమే స్పందించి తమ సొంత ఖర్చులతో సదరు విద్యార్థికి నూతన లాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీ పడాలనే ఉద్దేశంతో ఈ సాయం చేయడం జరిగింది. నిరుపేద కుటుంబాల నుండి వచ్చే విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ తల్లిదండ్రులకు, మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని" వారు హామీ ఇచ్చారు. తమ ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకుని, వేల రూపాయల విలువ చేసే లాప్‌టాప్‌ను బహుకరించినందుకు విద్యార్థి, వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కు, లక్ష్మణ్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, ఎండి వలీ బాబా, తాడూరి రఘు, కాకులమర్రి అరుణమ్మ,కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, వార్డు మెంబర్ కొండాయి చిన్ని, రెడ్డి ప్రమీల,దేపాక శ్రీరామ్, జాడి హరిబాబు, బాసాని శేఖర్, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వృద్ధుల పింఛన్ డబ్బులు ఇంటి పన్ను నల్ల పన్ను గ్రామ పంచాయతీ వసూళ్లు.

సంగెం ప్రజాదర్బార్ ఏప్రిల్ 30. మండలంలోనికాపుల కనపర్తి గ్రామంలో వృద్ధాప్య పింఛన్లు అందించే పోస్టాఫీస్ కేంద్రంలో వృద్ధుల దగ్గర గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటి పన్ను, నల్ల పన్ను వసూలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.పింఛన్ కోసం వచ్చిన పించన్ దారుల డబ్బుల నుంచి పన్నులు వసూలు చేయడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులకు ఇది భారంగా మారుతోందని తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామపంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా కారోబార్ పెండ్యాల రాజు సమాధానం ఇస్తూ వాళ్లు రమ్మంటేనే అక్కడికి వెళ్లినట్లు పొంతన లేని, బాధ్యతరాహిత్య సమాధానాలు ఇచ్చారు.



# ఉచిత కంటి చికిత్స శిబిరం విజయవంతం

నాగర్కర్నూల్ జిల్లా ప్రతినిధి ల్ 30 (ప్రజా దర్బార్ )నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ మరియు జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్ ప్రారంభించారు.ఈ శిబిరమును పాత కలెక్టరేట్కార్యాలయంలో నిర్వహించారు.కంటి గాయాల వలన,వయసు రీత్యా కంటి శుక్లాలు ఏర్పడతాయని డా.రవికుమార్ అన్నారు. ముఖ్యంగా వృద్ధులలో కంటిలో శుక్లాలు ఏర్పడడం వల్ల తాత్కాలిక అందత్వం కలుగుతుంది. ఇది కేవలం శస్త్ర చికిత్స నిర్వహించి ఐ.ఓ.ఎల్.ను అమర్చడం ద్వారా చాలా సులభంగా సరి చేయవచ్చని తెలియజేశారు. క్షేత్రిస్థాయిలోని సిబ్బంది కంటిలో శుక్లాలు గలఅనుమానితులందరినీ జిల్లాలో డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసే కంటి పరీక్ష శిబిరానికి తరలించాలని ఏఎన్ఎం లకు,ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈరోజు ఏర్పాటు చేసిన కంటి పరీక్షా శిబిరంలో 91మందిని పరీక్షించి అర్హులైన 37 మందికి ప్రాథమికంగా రక్త పోటు,మధుమేహ పరీక్షలు నిర్వహించి మహబూబ్నగర్ లోని ఎనుగొండలో గల లయన్ రాంరెడ్డి కంటి హాస్పిటల్ కు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా పంపించారు.ఈ కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ నర్సింహా ఆరోగ్య సిబ్బంది వై.శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి,చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# దత్తత అవగాహన కార్యక్రమం

రంగారెడ్డి 30 ఏప్రిల్ (ప్రజాదర్బార్):– ఫరూక్ నగర్ మండల ఎంపీడీవో ఆఫీస్ లో షాద్ నగర్ సిడిపిఓ ఉదయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దత్తత అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఫరూక్ నగర్ మండల ఎంపీడీవో బనిసిలాల్ గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చట్టబద్ధ దత్తత ప్రక్రియ మరియు అనధికార దత్తత వల్ల వచ్చే ప్రమాదాల గురించి మరియు వాటి రక్షణల గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ మరియు సంధ్య విపులంగా వివరించారు.పిల్లల్ని దత్తత తీసుకునేవారు పెళ్లయిన జంటలు 2 ఏళ్ల కలిసి ఉండాలని ఇద్దరి వయసు కలిపి పిల్లవాడి కన్నా 25 ఏళ్లు ఎక్కువ ఉండాలని ఒంటరి మహిళ ఏ వయసు బిడ్డనైనా దత్తత తీసుకోవచ్చునని, ఒంటరి పురుషుడు మాత్రం ఆడపిల్లను దత్తత తీసుకోలేరు అని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ చెప్పారు. దత్తత తీసుకునే వారి వయసు కనీసం 25 ఏళ్లు నుండి గరిష్టం 55 ఏళ్ల లోపు ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ ఉదయ మేడం మాట్లాడుతూ పిల్లల్ని దత్తత తీసుకునేవారు. ఆ పిల్లలను పోషించే స్తోమత ఉందా లేదా, పిల్లల్ని చదివించే స్తోమత ఉందా లేదా అని బాలల సంరక్షణ కేంద్రం వారు అన్ని ఎంక్వయిరీ చేసి పిల్లలని దత్తతగా ఇస్తారని చెప్పారు. కొంతమంది పిల్లల్ని తీసుకొని వారు చదివించలేక పోషించలేక ఇతరులకు అమ్ముకునేవారు ఉంటారని అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని తెలియజేసారు

## తూతూ మంత్రంగా మల్లూరు

# దేవస్థానం ప్రధాన రహదారి నిర్మాణం

### - పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు - జాతర ప్రారంభం నుంచే పనులు ప్రారంభం

ప్రజాదర్బార్,మంగపేట,ఏప్రిల్ 30: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో యాదాద్రిగా వేరుగాంచిన మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు కడువైభవంగా జరుగుతాయి. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చతిష్ గడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది భక్తులు ఈ బ్రహ్మోత్సవాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొ క్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. మల్లూరు నుంచి హేమాచల కొండలపైకి సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఇరుకు రోడ్డు తో పాటు శిథిలమైన తారు రోడ్డు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని మల్లూరు దేవస్థానం అధికారులతో పాటు పాలకమండలి సభ్యులు అధికార పార్టీ నాయకులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క దృష్టికి తీసుకువెళ్లి ఇరుకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. అయితే రోడ్డు వెడల్పు తో పాటు తారు రోడ్డు నిర్మాణానికి లక్షలాది రూపాయలు వెచ్చించి టెండర్ రూపేనా కాంట్రాక్టర్కు అప్పగిస్తే జాతర ప్రారంభం నుంచి తారు రోడ్డు ఆగమేఘాల మీద నిర్మించి రోడ్డుకి ఇరువైపులా నాణ్యమైన మొరం కంకర నింపాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా నాణ్యతలేని మట్టిని సైడ్ బర్మలలో తన ఇష్టానుసారంగా నింపి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు అనేక ఉన్నాయి. సైడ్ బర్మలలో పోసిన మట్టిని కనీసం వాటర్ క్యూరింగ్ చేసి రోడ్ రోలర్ తో తొక్కించాల్సి ఉండగా పలహారం లెక్క ఎక్కడ పడితే అక్కడ మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా నింపి చేతులు దులుపుకున్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా ప్రధాన ఘట్టమైన శ్రీ స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం, రెండో ప్రధాన ఘట్టమైన నాగవెల్లి పుష్పయాగం ఉత్సవాలకు వందలాది మంది భక్తులు ఆర్టీసీ ప్రైవేటు వాహనాలలో తరలివచ్చి తిలకించి మొక్కుని చెల్లించుకుని తిరిగి పోతుంటారు. జాతరకు రెండు నెలల ముందే ఈ పనులు జరగాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఒకవైపు జాతర జరుగుతున్న ప్పటికీ తన ఇష్టానుసారంగా తారు రోడ్డు సైడ్ బర్మ లు నింపి చేతులు దులుపుకుంటున్నారు. ఇంత బహిరంగ జరుగుతున్న నాసిరకం పనులను పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అటువైపు తొంగి చూసిన సందర్భాలు కానరావడం లేదని ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. తారు రోడ్డును మొక్కుబడిగా రెండించుల కంటే తక్కువ వేసి సైడు దుబ్బపోస్తున్నారు.



ఆర్టీసీ బస్సులు ప్రైవేట్ వాహనాలు రాకపోక సందర్భంగా మూలమలుపులతో పాటు సైడ్ బార్ మట్టి రోడ్డుపై ఉండడం వల్ల ఇంకా ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్ తో కుమ్మక్కై ఈ పనులను జాతరలోపే పూర్తి చేయాలని తలంపుతో ఆగమేఘాలపై తన ఇష్టానుసారంగా నాసిరకంగా నిర్మించి లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్నట్లు ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి జాతరకు వచ్చే భక్తులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకొని నాణ్యత ప్రమాణాలతో కూడిన బీటీ రోడ్డును శాశ్వతంగా ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టి మూల మలుపుల వద్ద చెట్లను తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. నిత్యం ఈ దేవాలయానికి భక్తులు వందలాదిగా తరలివస్తున్న క్రమంలో శాశ్వతమైన పనులు చేపట్టి ఆలయానికి వచ్చే భక్తులకు రక్షణగా నిలువాలని, నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని నాణ్యత ప్రమాణాలు సరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డుపైనే వ్యాపారాలు- ఆందోళనలో భక్తులు

### - మల్లూరు బ్రహ్మోత్సవాలలో దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం - ప్రధాన ఘట్టం సమయంలో రాకపోకలకు అంతరాయం





మంగపేట.ఏప్రిల్ 30: ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 5 వరకు జరిగే బ్రహ్మోత్సవాలు కడువైభవంగా జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు వందలాదిమంది భక్తులు హాజరై దైవదర్శనాలు తీసుకొని వెళుతుంటారు. జాతర సందర్భంగా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకోవడం వ్యాపారులకు ఆనవాయితీ. బహిరంగ వేలం పాటల ద్వారా షాపులకు దేవస్థానం అధికారులు ఇవ్వకుండా గోప్యంగా చిరు వ్యాపారులకు వ్యాపారం చేసుకొనుటకు అనుమతి ఇచ్చారు. అయితే ద్వైత మాత దగ్గర నుంచి మెట్ల వరకు ఈ వ్యాపారాలను అసలే ఇరుకురోడ్డు పై చిరు వ్యాపారులు తమ వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తున్నారు. భక్తుల రాకపోకల సందర్భంగా ఇరుకు రోడ్డు వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. వ్యాపారుల వద్ద నుంచి రుసుశీ వసూలు చేస్తున్న దేవస్థానం అధికారులు వ్యాపారులు నిర్వహించుకోవడానికి ఈ ప్రదేశాన్ని వెడల్పు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల ట్రాఫిక్ సమస్య నెలకొన్నది. ఇక స్వామివారి ప్రధాన ఘట్టమైన తిరు కళ్యాణ మహోత్సవం, పుష్పయాగం నాగవెల్లి వంటి కార్యక్రమాలకు వందలాది మంది భక్తులు వచ్చి పోవడం వల్ల వ్యాపారులకు ఇబ్బందితో పాటు భక్తులకు ఇరుకుగా ఉండటం వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యాపారుల దగ్గర నుంచి రుసుము వసూలు చేస్తున్న దేవస్థానం అధికారులు రాకపోకల సమస్య లేకుండా ఆ ప్రాంతాన్ని వెడల్పు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. భక్తుల రాకపోకలకు సమస్య ఉత్పన్నమవుతున్నదని పోలీస్ శాఖ అధికారులు మెట్ల దగ్గర నుంచి కొంత దూరం వరకు వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అంతవరకు ఓకే. కానీ ముఖ ద్వారం నుంచి ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారాలు రోడ్డుకిరువైపులా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటే ఇరుకుగా ప్రదేశం తయారయింది. అధికారుల నిర్లక్ష్యం వ్యాపారులకు శాపంగా మారిందని, భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నదని తెలిసిన చూచి చూడనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై ఈ ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానానికి ఆదాయం వస్తుందని సాకు చూపుతున్నారు తప్ప వ్యాపారులకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇరుకు రోడ్డుపై వ్యాపారాలు జరగకుండా చర్యలు తీసుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సిద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


# పదవ తరగతి పరిక్ష ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో సిద్ధార్థ విద్యా సంస్థల ప్రభంజనం

జగిత్యాల, ఏప్రిల్30,(ప్రజాధర్బార్) జగిత్యాల పట్టణంలోని సిద్ధార్థ విద్యా సంస్థలు మరోసారి తమ ప్రతిభను చాటుకుంటూ పదవ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో అద్భుత విజయాన్ని సాధించాయి. 2026 ఏప్రిల్ 29 బుధవారం రోజున విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయి లో 591, 590 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. అదే విధంగా 591,590 తో పాటు 580 పైన 21 మంది విద్యార్థులు, 570 పైన 63 విద్యార్థులు , 550 పైన 149 విద్యార్థులు, 500 పైన 324 విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సంస్థకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు. అదే విధంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులను జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ, మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, సూర్య గ్లోబల్ స్కూల్ యాజమాన్యాలుఅభినందించారు.




భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ బియ్యాల హరి చరణ్ రావు,బోయినపల్లి శ్రీధర్ రావు, రజిత, మౌనిక హరి చరణ్ రావు,సుమన్, అజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క



ప్రజాదర్బార్,మల్లంపల్లి, ఏప్రిల్ 30:మల్లంపల్లి మండలం కొడిశల కుంట గ్రామానికి చెందిన కుందూరు అనిత సుధాకర్ రెడ్డి ల ప్రథమ పుత్రిక వివాహానికి హన్మకొండలోని పంక్షన్ హాల్లో హాజరై నూతన వధూవరులను రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంచ అనిత రామ్మోహన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి,యూత్ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి వంచ రీశికేష్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన.ఎంజేవినోద్ కుమార్

ప్రజాదర్బార్. మహేశ్వరం ఏప్రిల్. 30 రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం ప్రజానాట్యమండలి 1943 లో ఏర్పడింది ఆ నాటి నుండి నేటి వరకు కల కోసం కాదు కల ప్రజల కోసం అనే నినాదంతో టి. ప్రజానాట్యమండలి కామ్రేడ్ గరికపాటి రాజారావు సర్దార్ అస్మి స్ఫూర్తితో.. ప్రజానాట్యమండలి నిత్యం ప్రజలలో ఉంటూ పాటలు రాస్తూ నాటకాలు రాస్తూ పాటలు పాడుతూ ప్రజలను చైతన్యం చేస్తుంది గ్రామీణ ప్రాంతాలలో మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తు. హరికథ యక్షగానం.ఒగ్గు కథ.సింధు. వంటి తోలుబొమ్మలాట కోలాటం బుర్రకథలు జానపద కళారూపాలను బ్రతికించాలని అనేక కళారూప. ప్రదర్శనలు వేస్తూఎంజే. వినోద్ కుమార్. ప్రజానాట్య మండలి కళాజాత నుండి గ్రామం నుండి మండల కార్యదర్శిగా 1996 లో ప్రజా నాట్య మండలి లో. పనిచేసి అక్కడి నుండి అంచల్ అంచలుగా ఎదిగి రంగారెడ్డి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శిగా పనిచేశాడు ప్రజా కలలు పాటనే ప్రాణంగా మలిచి



ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి మూడవ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రజానాట్యమండలి అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది . తన స్వగ్రామం చింతుళ్ళ. గ్రామం. మండలం. యచారం.గ్రామ నాయకులు హర్షం వ్యక్తం చేశారు రాష్ట్ర అధ్యక్షునిగా ఎదిగిన.ఎంజే.వినోద్ కుమార్ ను.శాలువా తో ఘనంగా.సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు. నాగలి యాదయ్య బిజెపి పార్టీ భువనగిరి పార్లమెంటు ఇన్చార్జి. నాగని బుగ్గ రాములు రైతు సంఘం మండల బాధ్యులు. నాగలి రాందాస్ బిజెపి మాజీ ఉపసర్పంచ్. మస్కు జంగయ్య సిపిఎం పార్టీ సీనియర్ సభ్యులు. సాకలి రాజయ్య. కుమ్మరి రామచంద్ర. కందుకూరు నరసింహ. దొడ్డి బాబయ్య కురుమ సంఘం అధ్యక్షులు. . ప్రజాదర్బార్ రిపోర్టర్. ఎం ఎం నరసింహ తదితరులు పాల్గొన్నారు

## మెదక్ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు ఆదర్శం

నర్సాపూర్ ఏప్రిల్ 30( ప్రజా దర్బార్ ): మెదక్ జిల్లాలో అంగన్వాడీల పనితీరు ఆదర్శంగా ఉందనీ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలో ని రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్ ను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ తనిఖీ చేసి అంగన్వాడి సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లీబిడ్డలకు సంపూర్ణ పోషకాహారం అందించాలని తెలిపారు. అనంతరం అంగన్వాడి కేంద్రం ఆవరణలో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయల తోటను చూసి సంతోషం వ్యక్తం చేసి అంగన్వాడి టీచర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సూపర్వైజర్ సరళ, గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, అంగన్వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.





## త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా..

ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 30: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం గాదిగూడ మండలంలోని పిప్రి (కొలంగూడ) గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను స్వయంగా సందర్శించిన కలెక్టర్, పనుల నాణ్యతను తనిఖీ చేయడంతో పాటు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. నిర్మాణ ప్రక్రియలో ఎక్కడా నాణ్యత లోపించకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం



క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ లబ్ధిదారులకు తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా బిల్లుల చెల్లింపు విషయంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే దశల వారీగా ఎంబీ రికార్డు చేసి, త్వరితగతిన నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కాలనీలలో కేవలం గృహ నిర్మాణమే కాకుండా, విద్యుత్, తాగునీరు, మురుగునీటి కాలువల వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏంఆర్ఓ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు

# తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు..

కారేపల్లి,ప్రజాదర్బార్ ఏప్రిల్ 30 మొక్కజొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దానికి అనుగుణంగానే మండలంలో సొసైటీ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నట్లు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండలం ఆప్పాయిగూడెం గూడెం గ్రామపంచాయతీ లో గల మార్క్ పెడ్ గోడౌన్ నందు మొక్కజొన్నల నిల్వ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఇటీవల మండల పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్యే కు రైతులు వద్దనుండి కొనుగోలు చేసే మొక్కజొన్న లారీ లోడ్స్ నిలువ చేసేందుకు ఇబ్బందికరంగా ఉందని విషయాన్ని తెలుసుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సబ్ కలెక్టర్ కు ఫోన్ ద్వారా సమస్యను వివరించడంతో మార్కెట్ గోడౌన్ లో మొక్కజొన్నలు నిలువ చేసుకునేందుకు అనుమతినిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి మండలం లో సుమారు 8000 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట సాగు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2400 రూపాయలకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తుంది అన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవని మరల వర్షం పడితే రైతుల



ఇబ్బందులు పడతారని ఉద్దేశంతో ఖాళీ ప్రదేశాల్లో అరబోసిన మొక్కజొన్నలను గోడౌన్ లోకి చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు . రైతులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని ప్రతి రైతు వద్ద నుండి మొక్కజొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత గోడౌన్ సరి పోకపోతే అవసరమైతే జిన్నింగు మిల్లు లో ధాన్యం నిల్వ ఉంచేలా ఏర్పాటు చేస్తామన్నారు. గోడౌన్ వద్ద రహదారి మార్గం అధ్వానంగా ఉందని త్వరలో ప్రతిపాదనలు పంపి బి టి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఆర్ ఐ డి జగదీష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, కారేపల్లి ఎస్సై బైరు గోపి, సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, పెద్దబోయిన ఉమాశంకర్, మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్, సర్పంచులు దండు ప్రవీణ్, బానోత్ హిరాలాల్, వీర ప్రతాప్ టోనీ, మేదరి రాజా తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభం



హనుమకొండ ప్రజాదర్బార్ ఏప్రిల్ 30: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు, ఉద్యోగుల కోసం వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ( డిఆర్డిఏ ), తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా కలెక్టరేట్ లో ప్రజలు, ఉద్యోగుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చలివేంద్రంలో చల్లని నీటితో పాటు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్డివో మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఆర్డీవో లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస స్వామి, టీజీవో నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మే 5న జగిత్యాల జిల్లా కేంద్రము లో సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయండి

### పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ

జగిత్యాల, ఏప్రిల్30,(ప్రజాదర్బార్)ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే 5న జిల్లా కేంద్రము లో సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయండి అని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు అన్నారు. 206 సంఘాలతో ఏర్పడిన టీజీఈజేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, రాష్ట్రంలోని ఉద్యోగులు,

ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 2026 మే 5వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రాములో "సామూహిక నిరాహార దీక్ష"(1)రోజుకార్యక్రమాన్నినిర్వహిస్తున్నామని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయినపల్లి ఆనందరావు అన్నారు 2026 ఏప్రిల్ 30 గురువారం రోజున జగిత్యాల్ అర్బన్ మండల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గోపాలరావుపేట్ లో పనిచేస్తూ ప ఉద్యోగ విరమణ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు బండపల్లి పవన్ కుమార్ సన్మాన మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ జూన్ రెండు లోపు పిఆర్సీ అమలు చేయాలి పెండింగ్ బిల్లు ఒకేసారి చెల్లించాలి హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలి సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు దాదాపు పదిహేను లక్షల మంది ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేసేందుకు నిర్వహిస్తున్న ఈ సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారు అన్నారు అనంతరం బండ పెల్లి పవన్ కుమార్ సేవలను కొనియాడారు పవన్ కుమార్ ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రకళ గ్రామ సర్పంచ్ దావ తిరుపతి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ భారతిపాఠశాలప్రధానోపాధ్యాయులు రమేష్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్ వెంకటరమణ పెన్షనర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిచాల రవీందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



## నృసింహ జయంతి వేడుకలు ఘనంగా

చీర్యాలకీసర,ఏప్రిల్ 30, ప్రజా దర్బార్: నృసింహ జయంతి సందర్భంగా గురువారం శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం హరినామస్మరణతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం పూట పంచామృత నవకలశాభిషేకం భక్తి శ్రద్ధలతో జరిగింది. అనంతరం స్వామివారికి వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గారి చేతుల మీదుగా తులసి లక్ష పుష్పార్చన మరియు సప్తహారతులు నిర్వహించడం విశేషం. ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై ఆలయాన్ని కళకళ లాడించారు. స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి పారవశ్యంతో సాగింది.



# ఈవ్‌టీజింగ్‌పై షీ--టీమ్స్ ఉక్కుపాదం :ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



మెదక్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30:( ప్రజా దర్బార్) జిల్లాలో మహిళలు, బాలికల భద్రత కోసం షీ--టీమ్స్ కట్టుదిట్టంగా పనిచేస్తున్నాయని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఏప్రిల్ నెలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై 8 ఎఫ్ఐఆర్‌లు, 8 ఈ--పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 16 మంది, మెదక్ సబ్‌డివిజన్‌లో 40 మంది.మొత్తం 56 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మహిళలను గౌరవించాలని, చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బస్‌స్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో షీ--టీమ్స్ ఆధ్వర్యంలో 40 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, బాల్యవివాహాల నిరోధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్--100 లేదా షీ--టీమ్ వాట్సాప్ నంబర్ 8712657963కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండకముందే బాలికల వివాహాలు జరిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పనిచేస్తోందని, మానవ అక్రమ రవాణా, ఆర్గనైజ్డ్ నేరాలపై సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్



యాదాద్రి(తుర్కపల్లి) ఎప్రేల్ 30(ప్రజాదర్బార్) రైతును రాజు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రైతులను రోడ్డుపాలు చేస్తోందని, రైతుల ఉసురు ఈ ప్రభుత్వానికి కచ్చితంగా తలుగుతుందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై బైఠాయించి రైతులతో కలిసి రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అడుగడుగునా వంచిస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో పది రోజులుగా రైతులు పడి గాపులు కాస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి ,మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, మండల సెక్రటరీ జనరల్ సాగర్ల పరమేష్, సర్పంచులు మోతీరాం నాయక్, సీతరాజు, మాజీ ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, మాజీ సర్పంచులు ఇమ్మడి మల్లప్ప శ్రీశైలం నాయకులు, భూక్య రవీందర్ నాయక్, రాజేష్ నాయక్, మేకల బాలకృష్ణ, సదుల్లా, కార్యకర్తలు ,అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి:జిల్లా కలెక్టర్




వికారాబాద్ జిల్లాప్రతినిధి, ఏప్రిల్30(ప్రజాదర్బార్) జిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా సిసి రోడ్లు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు , ఎస్ ఎస్ జి భవన నిర్మాణము, స్కూల్ కాంపౌండ్ వాల్ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు నందు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, 99 రోజులపాటు నిర్వహించే ప్రజా పాలన ప్రగతి నివేదిక అంశాలపై హౌసింగ్ ,సి సి రోడ్లు, ఎస్ ఎస్ జి బిల్డింగ్స్ , స్కూల్స్ కాంపౌండ్ వాల్స్ ,అంగన్వాడి ,పీ హెచ్ సీ సెంటర్స్ ,ఇందిరమ్మ ఇళ్ళు ,భవిత సెంటర్స్ , గోదాంల, నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే మంజూరైన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ముందే మంజూరైన పనులు పూర్తి చేయాలనీ, ఎక్కెడెక్కడ గ్రౌండ్ కాలేని చోట తప్పని సరిగా పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యం మేరకు అంగన్ వాడి, గ్రామ పంచాయతి బిల్డింగ్ , వి ఎ ఓ బిల్డింగ్ పనులపై దృష్టి సారించి పూర్తి చేసి రిపోర్ట్ సబ్మిట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలం వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డి ఈ ఓ రేణుకాదేవి ,పంచాయతి రాజ్ ఇ ఇ ఉమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహాబోధి బుద్ధవిహార్ బిక్షువుల మజ్జిగ పంపిణీ




అల్వాల్, ఏప్రిల్ 30 (ప్రజాదర్బార్) : తీవ్ర ఎండల మధ్య పాదచారుల దాహార్తిని తీర్చేందుకు న్యూ బొల్లారం, రిసాలా బజార్ బస్ స్టాప్ ప్రాంతాల్లో మహాబోధి బుద్ధ విహార్ బిక్షువులు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షువులు ప్రార్థనలు చేసి ప్రజలకు మజ్జిగ అందించారు. బొల్లారం కేంద్రంగా పనిచేస్తున్న సేవా పరోమో ధర్మ ఫౌండేషన్ వాలంటీర్లు కార్యక్రమానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధపాల భంతే, ఇతర శ్రామణేర భంతేలు, చైర్మన్ విజయ్ కుమార్ గైక్వాడ్, సుధాకర్, అజయ్, చందు, నర్సింగ్ రావు, సోహిని జాధవ్, రోష్ని తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహసీల్దార్ ను నియమించండి

దుగ్గొండి (ప్రజాదర్బార్) ఏప్రిల్ 30 దుగ్గొండి మండలానికి డిప్యూటీ తహసీల్దార్ ను వెంటనే నియమించాలని తిమ్మంపేట మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గొండి డిప్యూటీ తహసీల్దార్ గా పని చేసిన ఉమారాణి ఏప్రిల్ 25 వ తేదీన బదిలీ కావడం జరిగిందని ,అప్పటి నుండి ఇప్పటి వరకు మరొక అధికారి ని ప్రభుత్వం నియమించలేదన్నారు. తద్వారా మండల ప్రజలు, విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కోవల్సివస్తుందన్నారు. విద్యార్థుల పై చదువుల కోసం కావల్సిన ధృవీకరణ పత్రం లలో జాప్యం జరుగుతుండడం తో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ,ఇప్పటికైనా దుగ్గొండి కి నూతన డిప్యూటీ తహసీల్దార్ ను నియమించాలని విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు.



# చర్ల సీహెచ్‌సీలో ఆరు నెలల్లో 100 శస్త్రచికిత్సలు

## స్థానిక గిరిజనులకు వరంగా మారిన ప్రభుత్వాసుపత్రి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 30 ప్రజా దర్బార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిసర ప్రాంతాలకు వైద్య సేవల్లో కీలకమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రి గత ఆరు నెలల్లో 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి మరో మైలురాయిని సాధించింది. గతంలో చర్ల ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ట్యూబెక్టమీ వంటి శస్త్రచికిత్సల కోసం రోగులు 56 కి.మీ దూరంలోని ఏరియా ఆసుపత్రి భద్రాచలం వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సలతో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రావడం గమనార్హం. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి ఆరు నెలల క్రితం చర్ల ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. అలాగే మాతృ సేవలకు అవసరమైన ప్రసూతి, పిల్లల, మత్తు వైద్య నిపుణులను నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది.జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి: ప్రస్తుతం జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్ చర్ల ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవలే ఒక రేడియాలజిస్ట్ వైద్య నిపుణురాలిని నియమించారు. అలాగే అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, ముగ్గురు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.మరింత విస్తృత సేవల దిశగా కృషి -- డీసీహెచ్ఎస్ డా. రవి బాబు డీసీహెచ్ఎస్ డా. రవి బాబు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు మద్దతుతో మరింత విస్తృత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సల మైలురాయి సాధించినందుకు చర్ల ఆసుపత్రి వైద్య బృందం డా. కె. శ్రావణి, డా. కె. శివ రామకృష్ణ ప్రసాద్ మరియు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని అభినందించారు. అవసరమైన మద్దతు అందించిన జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఓపీ గదుల ఏర్పాటు, పరికరాల మంజూరు చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు. చర్లలో నిర్మాణంలో ఉన్న 30 పడకల నూతన భవనం పూర్తయిన తర్వాత మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలమని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు చర్ల ఆసుపత్రిలో అందుతున్న సేవల పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి చిన్న అవసరానికీ భద్రాచలం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ అవసరం లేకపోవడం సంతోషకరమని తెలిపారు. ముఖ్యంగా గర్భిణి మహిళలకు చర్ల ఆసుపత్రి ఎంతో అనుకూలంగా మారిందని, దీంతో ఆర్థిక భారం మాత్రమే కాకుండా ప్రయాణ ఇబ్బందులు కూడా గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు

# పంట అవశేషాలు తగలబెట్టొద్దు...



పాలేరు , ఏప్రిల్ 30 (ప్రజాదర్బార్ న్యూస్)కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో మొక్కజొన్న పంట అవశేషాలను తగలబెడుతున్న క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి ఆర్. వాణి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడి పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలో ఉన్న మేలు చేసే సూక్ష్మజీవులు నశించి, భూసారం దెబ్బతింటుందని తెలిపారు .అంతేకాకుండా వాయు కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని సూచించారు.అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్ని సహజ ఎరువులుగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. దీంతో భూసారం మెరుగుపడి, భవిష్యత్తులో పంట దిగుబడులు కూడా పెరుగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక వనరులతో గిరిజన యువతకు స్వయం ఉపాది:జిల్లా కలెక్టర్



ప్రజాదర్బార్ ఆదిలాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 30: స్థానిక వనరులతో విభిన్నమైన ఆకర్షణీయమైన కళాఖండాలను తయారు చేయడం ద్వారా గిరిజన యువతకు స్వయం ఉపాధి లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారానే గిరిజనుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. గురువారం నార్నూర్ మండలంలోని నడ్డంగూడ గ్రామంలో గిరిజన కళాకారుల కోసం ఏర్పాటు చేసిన ‘కళాత్మక వెదురు వస్తువుల తయారీ’ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక వనరులతో విభిన్నమైన ఆకర్షణీయమైన కళాఖండాలను తయారు చేయడం ద్వారా గిరిజన యువతకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వెదురు వస్తువుల తయారీలో నైపుణ్యం సాధించడం ద్వారా గిరిజన కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజనులు కేవలం సాంప్రదాయ బుట్టల తయారీకే పరిమితం కాకుండా, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక గృహాలంకరణ వస్తువులు, ఫర్నిచర్‌ను తయారు చేయాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని, తద్వారా ప్రతి ఒక్కరూ నెలకు గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నార్నూర్ మండల అడ్వైజరీ బ్లాక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో భాగంగా, నిపుణులచే వెదురుతో చేసే బుట్టలు, అలంకరణ , నిత్యజీవితంలో ఉపయోగపడే వివిధ వస్తువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. గ్రామీణ ప్రజలు, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ రవీందర్, ఎంపీడీవో పుల్లరావు , ఏంఆర్ఓ రాజలింగు, ఇతర మండల స్థాయి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మోమిన్‌పేట విద్యార్థిని పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటింది.

మోమిన్ పేట ఏప్రిల్ 30 ప్రజా దర్బార్. పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో మోమిన్‌పేటకు చెందిన ఓ విద్యార్థి విశేష ప్రతిభ కనబరిచి స్థానికంగా ప్రశంసలు అందుకుంటుంది. మోమిన్ పేట గ్రామానికి చెందిన మహమ్మద్ అఫ్జల్ కుమార్తె రిషా తస్కిన్ 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించింది చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి కలిగిన ఈ విద్యార్థి క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగింది ముఖ్యంగా అత్యుత్తమ మార్కులు సాధించి అందరినీ ఆకట్టుకున్నది విద్యార్థిని విజయంపై వింటేజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది ఫలితం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు విద్యార్థిని తెలిపారు. గ్రామ ప్రజలు, స్నేహితులు ఆమెకి అభినందనలు తెలియజేస్తున్నారు. వికారాబాద్ డివిజన్ లోని రెండవ స్థానం రావడం గర్వించదగ్గ విషయం అన్నారు. సాధారణ కుటుంబం లో పుట్టి టాపర్ గా నిలవడం ఎంతో గొప్ప విషయం అన్నారు.



# పౌర హక్కుల ప్రాముఖ్యతపై అవగాహన

## అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్



పెద్దమండడి ఏప్రిల్ 30 (ప్రజా దర్బార్ ) ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడ తెలుసుకొని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం పెద్దమండడి మండల పరిధిలో పర్యటించిన అదనపు కలెక్టర్, జగత్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పౌర హక్కుల దినం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పౌర హక్కుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ కీలక సూచనలు చేశారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకొని సమాజ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మణిగిల్ల, చిన్నమండడి, వెల్టూర్, పెద్దమండడి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిర్వహణపై ఆరా తీసి, రిజిస్టర్లు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా మరియు వేగవంతంగా నిర్వహించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం స్వీకరణలో నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందిగా సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ క్షేత్ర స్థాయిలో ఇంధన సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్తకోట మరియు వెల్టూరు ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులను ఆయన తనిఖీ చేశారు. పెట్రోల్ బంకుల్లో నిల్వలు, సరఫరా విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇంధన సరఫరా నిరంతరం కొనసాగాలని డీలర్లకు సూచించారు. అలాగే, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, పారదర్శకంగా ఇంధన విక్రయాలు నిర్వహించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని డీలర్లకు కీలక సూచనలు చేశారు. డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో పరిణత, గ్రామ సర్పంచ్ పెంటన్న యాదవ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట్ గౌడ్, విశ్వం బాబు, ఆర్ ఐ గణేష్, గ్రామ ప్రజలు ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# మండల కేంద్రానికి ఎమ్మెల్యే రాక



పెద్దమండడి ఏప్రిల్ 30 (ప్రజా దర్బార్ ) మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఇందిరమ్మ నూతన గృహ ల ప్రొసీడింగ్ లబ్ధిదారులకు అందించేందుకు ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వస్తున్నట్లు వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త కాపు రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా, మండల, గ్రామాల వివిధ హోదాలలో పనిచేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని తెలిపారు.

# చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధి: మంత్రి సీతక్క



ప్రజాదర్బార్,ఏప్రిల్ 30: పిల్లల సంరక్షణ, తల్లుల గౌరవం లక్ష్యంగా కాచిగూడలో కీలక కార్యక్రమాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అడాప్షన్ హెల్పింగ్ డెస్క్, ఫోస్టర్ కేర్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. అదేవిధంగా కాచిగూడ బస్ స్టేషన్‌లో శిశువులకు పాలిచ్చే గదిని – బ్రెస్ట్ ఫీడింగ్ కియోస్క్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ ప్రియాంక ఆలా, కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు. “చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధి” అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇవి సాధారణ కార్యక్రమాలు కావని, ప్రభుత్వ మానవత్వానికి ప్రతిబింబమని మంత్రి అన్నారు. దత్తత అనేది దానం కాదని, చిన్నారి జీవితానికి కొత్త ఆరంభమని మంత్రి స్పష్టం చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా దత్తతపై చట్టబద్ధమైన మార్గదర్శనం, కౌన్సిలింగ్ అందిస్తామని తెలిపారు. అనధికారిక దత్తతల అక్రమాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫోస్టర్ కేర్ విధానం పిల్లలకు తాత్కాలికంగా ప్రేమతో కూడిన వాతావరణం కల్పిస్తుందని చెప్పారు. రద్దీ ప్రాంతమైన కాచిగూడ బస్టాండ్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ కియోస్క్ ఏర్పాటు కీలక నిర్ణయమన్నారు. తెలంగాణ చరిత్రలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం మొదటిసారి అని మంత్రి గుర్తుచేశారు. రోష్నీ సెంటర్‌తో కలిసి పిల్లలకు కౌన్సిలింగ్, థెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ ప్రభుత్వ “99 రోజుల ప్రణాళిక”లో భాగమని మంత్రి వెల్లడించారు. చిన్నారుల కోసం చేసే ప్రతి చిన్న ప్రయత్నం గొప్ప మార్పును తీసుకువస్తుందని మంత్రి సీతక్క అన్నారు.

# సెట్విన్ తో మహిళలకు స్వయం ఉపాధి..

మక్తల్ ఏప్రిల్ 30 ప్రజాదర్బార్ మక్తల్ నియోజకవర్గం సెట్విన్ తో వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలోని సెట్విన్ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కంప్యూటర్ ట్రైనింగ్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలను నేరుగా కలుసుకొని, వారి శిక్షణ తీరుతెన్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సెట్విన్ రాకతో మక్తల్ పట్టణంలోనే మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు మార్గం సుగమయిందని అన్నారు. టైలరింగ్ తో పాటు అన్ని విభాగాల్లోని మహిళలకు రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుంచి పెద్ద పెద్ద కంపెనీలను తీసుకువచ్చి, వారికి నేరుగా ఉపాధిని మక్తల్ లోనే అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అమరచింతలో ప్రత్యేకంగా షెడ్యూల్ నిర్మించి హైదరాబాద్ నుంచి కంపెనీల ద్వారా మహిళలకు ఉపాధి అందిస్తున్నామని తెలిపారు. మక్తల్ లో సైతం పెద్దపెద్ద షెడ్లు నిర్మించి మహిళలకు ఉపాధి అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని విద్యార్థులకు యూనిఫామ్ లను కుట్టే ఉపాధిని సెట్విన్ లో శిక్షణ పొందే వారికి అందించి, వారికి భరోసా కల్పిస్తామన్నారు. మక్తల్ ను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సెట్విన్ లో అన్ని ప్రాంతాల నుంచి ఆయా విభాగాల్లో నిష్ణాతులుగా తయారు కావాలని సూచించారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరికి సెట్విన్ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, టైలరింగ్ ట్రైనర్ ఫర్జానా, బ్యూటీషియన్ ట్రైనర్ స్వప్న, మగ్గం వర్క్ జర్దోసి ట్రైనర్ వీరమ్మ, కంప్యూటర్ ట్రైనింగ్ ట్రైనర్ తిమ్మప్ప, సిబ్బంది ప్రవీణ్, నాయకులు బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య నీల గౌడ్, కో ఆప్షన్ మెంబర్ శంషుద్దీన్, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఫలితాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

## - ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి శెట్టి కోటి

ప్రజాదర్బార్,వెంకటాపూర్, ఏప్రిల్ 30:పదవతరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి,ఉత్తీర్ణత సాధించి ప్రభంజనాన్ని సృష్టించిన జెడ్పిహెచ్ఎస్ వెంకటాపూర్ మండల విద్యార్థులు జే అంజలి 560, ఏం జయశ్రీ, 556, ఆర్ శ్రీజ, 553 లకు ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి వారిని శాలువాలతో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రామప్ప ట్రస్ట్ బోర్డు చైర్మన్ మిల్కూరి.ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు విట్ట.విజయ్ బాబు,బాబూరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక,పాఠశాల చైర్మన్,నాయకులుప్రవీణ్,శ్రీధర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోతారం వాగు ఆక్రమణలపై కలకలం...

## భూ బకాసురుల దర్జా -- నిద్రలోనే అధికార యంత్రాంగం!



శామీర్ పెట,ఏప్రిల్ 29(ప్రజాదర్బార్):మూడుచింతలపల్లి మండలం చిన్న పర్వతాపూర్ పరిధిలోని పోతారం వాగు అక్రమ ఆక్రమణలు తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. కొందరు భూ బకాసురులు ఎటువంటి భయం లేకుండా బండరాళ్లు, మట్టి పోసి వాగును పూడ్చి భూములను ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాగు మధ్యలోనే భారీగా మట్టిపోసి రియల్ ఎస్టేట్ దందాలకు మార్గం సుగమం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాల్లో కొందరు అధికారులు కూడా రియల్ వ్యాపారులతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. రోజులు గడుస్తున్నా చర్యలు లేకపోవడంతో "అధికారులకు అందిన వాటా ఎంత?" అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. చిన్న పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలో ఇలాంటి అక్రమాలపై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చినా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. వాగు సహజ ప్రవాహానికి భంగం కలిగితే భవిష్యత్తులో వరదలు, భూగర్భ జలాల తగ్గుదల, పర్యావరణ నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి, వాగును సహజ స్థితికి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# సింగరేణి ఉద్యోగికి సన్మాన కార్యక్రమం




చంద్రుగొండ ఏప్రిల్ 30 ప్రజా దర్బార్ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం, సత్తుపల్లి సింగరేణిలో జూ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఎండి ఫైజుద్దీన్ సింగరేణిలో పదవీ విరమణ పొందారు. సహ తోటి ఉద్యోగులు అదరూ కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు .ఈ సన్మాన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్ అశ్వరావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఎండి ఫజల్ బక్షి పాల్గొని శాలువాతో సత్కరించారు. ఇరువురు మాట్లాడుతూ ఫైజుద్దీన్ సేవలను గుర్తించిన యాజమాన్యం సన్మాన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబునగర్ జిల్లా ఆక్రీడిటేషన్ కమిటీ తొలి సమావేశం

## అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అధ్యక్షతన నిర్వహణ



(ప్రజాదర్బార్/మహబూబునగర్)మహబూబునగర్ జిల్లా మీడియా ఆక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏ సి) తొలి సమావేశం మహబూబునగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల నేరకు పారదర్శకంగా అర్హులైన జర్నలిస్టులకు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ద్వారా అక్రిడిటేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమాచార శాఖ, సహాయ సంచాలకులు (డిపిఆర్ఓ) శ్రీనివాస్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ, మార్గదర్శకాలు, భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే విధానం, అర్హతలు, పారదర్శకతపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో తాగి తొలి మీటింగ్ విజయవంతంగా పూర్తి అయ్యింది. అతి త్వరలోనే కమిటీ రెండవ సమావేశం నిర్వహించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కార్డుల జారీ ప్రక్రియపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె ఉమామహేశ్వరరావు, ఎండి జకీ, కరణం భాస్కరరావు, పి రవికుమార్, చింతకాయల వెంకటేష్, యాదిలాల్ జి, భాస్కరాచారి, ఎన్ సతీష్ కుమార్ రెడ్డి, కాటం నాగరాజుగౌడ్, కె విజయ్ పాల్గొన్నారు.

# పోచారంలో సాగుపై అవగాహన సదస్సు

పరకాల ప్రజాదర్బార్ ఏప్రిల్ 30: పరకాల మండలం పోచారం గ్రామంలో వానాకాలం సాగుకు రైతులను సన్నద్ధం చేసే లక్ష్యంతో 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు'అనే వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ భవనంలో ఈ సదస్సు జరిగింది. నేల ఆరోగ్యం – రసాయనాల నియంత్రణ ఈ సందర్భంగా సేద్య పరిజ్ఞాన శాస్త్రవేత్త ఎ.సతీష్ మాట్లాడు తూ.. రైతులు విచక్షణారహితంగా యూరియా వాడటాన్ని తగ్గించాలని సూచించారు. అవసరానికి అనుగుణంగానే ఎరువులను వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పచ్చి రొట్ట ఎరువుల ప్రాముఖ్యత,సాగునీటి పొదుపు పద్ధతులు మరియు పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన రైతులకు వివరించారు.తెగుళ్ల నివారణ – జీవ నియంత్రణ వృక్ష వ్యాధి శాస్త్రవేత్త యశస్విని మాట్లాడుతూ.. పంటలలో వచ్చే వివిధ రకాల తెగుళు ,,పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. రసాయన మందుల కంటే జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పర్యావరణానికి మరియు రైతులకు చేకూరే లాభాలను ఆమె వివరించారు.ప్రభుత్వ పథకాలు మరియు సబ్సిడీలు మండల వ్యవసాయ అధికారి సోమరాతి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో ఎరువుల యాజమాన్యం,విత్తనాల లభ్యత గురించి వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బి.రాజయ్య, పోచారం గ్రామ సర్పంచ్ మధుకర్,ఉప సర్పంచ్ కొలపాక చందు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,వ్యవసాయ కళాశాల విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఫిన్లాండ్ సందర్శించిన ఉపాధ్యాయురాలిని అభినందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా ప్రజా దర్బార్ ప్రతినిధి ఏప్రిల్ 30 విద్యాశాఖ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ఫిన్లాండ్‌ను సందర్శించిన గాంధారి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి భవాని ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు భవాని, ఫిన్లాండ్‌లోని విద్యా విధానం, విద్యారంగ పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. అక్కడి పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు, మాతృభాషకు ఇచ్చే ప్రాధాన్యత, వృత్తి విద్యకు కల్పిస్తున్న ప్రోత్సాహం గురించి తెలియజేశారు. ఫిన్లాండ్‌లో అమలవుతున్న ఉత్తమ విద్యా విధానాల్లో కొన్నింటినైనా జిల్లాలోని పాఠశాలల్లో అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు వినూత్న విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, విద్యాశాఖ సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణ

## - మే 2న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సభలు..... కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా ప్రజా దర్బార్ ప్రతినిధి ఏప్రిల్ 30 కామారెడ్డి జిల్లాలోప్రజా పాలన మరియు ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణలో భాగంగా, మే 2న అన్ని జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సభల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజా పాలన అంటే ప్రజల వద్దకే పాలన. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో సభలు నిర్వహించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, సత్వర పరిష్కారం చూపడమే మన లక్ష్యం" అని తెలిపారు. "సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. అర్జీల స్వీకరణ, పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి" అని అధికారులకు సూచించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మదన్ మోహన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి మరియు సిపిఓ రఘునందన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి నూతన జడ్జిగా వి.మాధవి



జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 30 (ప్రజాదర్బార్) జగిత్యాల జిల్లా మెట్ పల్లి నూతన జూనియర్ సివిల్ జడ్జి గా వినుకొండ మాధవి పదవీ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న నారం అరుణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు బదిలీ కాగా, ఖమ్మం జిల్లా మూడవ అదనపు కోర్టు మెజిస్ట్రేట్ గా పనిచేస్తున్న మాధవి మెట్ పల్లి కోర్టుకి బదిలీ పై వచ్చారు. గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి పూల మొక్క అందించి వారికి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, క్రీడా కార్యదర్శి నీరటి రమణ, జూనియర్ ఈసి మెంబెర్ మాలేపు సంధ్య రాణి, న్యాయవాదులు కోటగిరి వెంకట స్వామి, చైతన్య, సత్యనారాయణ, మన్నె గంగాధర్ ఉన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాలలో

# దోమకొండ విద్యార్థుల విజయకేతనం




దోమకొండ ఏప్రిల్ 30 , ( ప్రజా దర్బార్ ) పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కామారెడ్డి జిల్లా దోమ కొండ మండలంలోని విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో దోమకొండ మండలంలో 98.66% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కామారెడ్డి జిల్లాలో దోమకొండ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థిని గొబ్బూరి ప్రణవి 582 మార్కులతో ప్రథమ స్థానం , విద్యార్థిని ఎన్ భవాని 578 మార్కులతో తృతీయ స్థానం నిలిచారని మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడు తూ: జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 95.24% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పి వరుణ్ 442 మార్కులు , బి నరేష్ 539 మార్కులు సాధించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత . ప్రణవి 582 మార్కులు 578 భవాని సాధించారు. సాధించారు. జెడ్పి అంబారీ 97.14% ఉత్తీర్ణత సాధించారు . హర్షవీర్ 566 పి దీవక్ 549 మార్కులు సాధించారు. జడ్పీ ముత్యంపేట్ 100% ఉత్తీర్ణత . యాసవి 535 , అభిరామ్ గౌడ్ 520 మార్కులు సాధించారు. సంగమేశ్వర్ జిల్లా పరిషత్ పాఠశాల 96.88 శాతం ఉత్తీర్ణత. జట్టబోయిన మిథున్ బింద్ర 575 మార్కులు , 546 ఎన్ సాయి చరణ్ సాధించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 100% ఉత్తీర్ణత . రమ్యశ్రీ 572 మార్కులు, టి సింధుజ 542 మార్కులు సాధించారు. బాలిక గురుకుల పాఠశాల 100% ఉత్తీర్ణత . ఏ సంజనా బాణావత్ లహరిక లు 580 మార్కులు , 567 కే అభిస్తా మార్కులు సాధించారు. అభ్యుదయ పాఠశాల 100% ఉత్తీర్ణత . సాయి తేజ 580 మార్కులు వినయాత్ రెడ్డి 565 మార్కులు సాధించారు.

## పెద్దాపూర్ లో కామినేని ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరం

వెల్గండ::ఏప్రిల్ 30 (ప్రజాదర్బార్) :మండల పరిధిలోని పెద్దా పూర్ గ్రామంలో కామి నేని ఆసుపత్రి ఆధ్వర్యం లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ,ఉపసర్పంచ్ ప్రసాద్ లు వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఈ సందర్భంగా మాట్లాడాతూ . నిరుపేదలకు కామి నేని ఆసుపత్రి వారు ఉచి తంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం మంచి పరిణామని అన్నారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించిన కామినేని ఆసుపత్రి వారికి కృతజ్ఞతలు తెలి పారు.కామినేని ఆసుపత్రి వారు వైద్య పరీ క్షలు నిర్వహించి మందులు కళ్లద్దాలను పంపిణీ చేశా రు.ఈ కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి వైద్య బృందం దేవేందర్ హారిక హరీష్ రెడ్డి వార్డు సభ్యులు అనిల్ కుమార్ నిరంజన్ తిరుపతి శ్రీధర్ గౌడ్ అంజయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి సాయిసన్నిధిలో ఆధ్యాత్మిక శోభ: మరో షిరిడిగా ఖ్యాతి

చింతపల్లి, ఏప్రిల్ 30 (ప్రజా దర్బార్): నల్లగొండ జిల్లా చింతపల్లిలోని శ్రీ సాయిబాబా దేవాలయం (సాయిసన్నిధి) రోజురోజుకూ భక్తుల పాలిట కల్పవల్లిగా మారుతోంది. భక్తిశ్రద్ధలకు నిలయంగా మారిన ఈ క్షేత్రం, భవిష్యత్తులో 'మరో షిరిడి' గా విరాజిల్లుతుందని భక్తులు తమ ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ?మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు ?గురువారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆలయాన్ని సందర్శించారు.?బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు మంత్రికి వేద మంత్రాల మధ్య తీర్థ ప్రసాదాలు అందించి, బాబా వారి ఆశీస్సులు అందజేశారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ?పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:?"చింతపల్లి సాయిసన్నిధి అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా ఎదుగుతోంది. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటాం. సాయి బాబా ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నాను. ?భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం ?గురువారం కావడంతో తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి బాబాను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భజనలు, సాయి నామ స్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధనుంజయ, చింతపల్లి మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా వారి కృపకు పాత్రులయ్యారు. చింతపల్లి సాయిసన్నిధి కేవలం ఒక ఆలయంగానే కాకుండా, ఈ ప్రాంతపు ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుండటం విశేషం.

## జమ్మికుంట రూరల్ సీఐ గా పులి వెంకట్ బాధ్యతలు స్వీకరణ

ఇల్లందకుంట ప్రతినిధి ఏప్రిల్ 30, (ప్రజా దర్బార్): జమ్మికుంట రూరల్ సీఐగా పనిచేసిన సీఐ కిషోర్ బదిలీపై వెళ్లగా జమ్మికుంట రూరల్ సీఐగా పులి వెంకట్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి సమస్యలు చెప్పుకోవాలని అన్నారు శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

# పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వ్యవస్థను కామారెడ్డి జిల్లాలో అమలు.... జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా ప్రజా దర్బార్ ప్రతినిధి ఏప్రిల్ 30 పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సిపిఓ గా నియమించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ లెవెల్ సర్వీస్ అథారిటీ సహకారంతో అమలు చేస్తున్న విషయం విదితం. ఈ సందర్భంగా తెలియజేయునది ఏమనగా, ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం, కామారెడ్డి జిల్లాలో ముందుగా విజయవంతంగా అమలు చేసిన నమూనా (మోడల్)కు ప్రతిరూపం రిప్లికేషన్ గా తీసుకోబడింది. కామారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమం కింద ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సిపిఓగా నియమించడం జరిగింది. విద్యార్థుల భద్రత, హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. శారీరక శిక్షలు, బుల్లీయింగ్ నివారణ, మరియు ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సెక్సువల్ అఫెన్స్ చట్టం అమలు పై ప్రత్యేక దృష్టి సారించబడినది. ప్రమాదానికి లోనయ్యే పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోబడినవి. జిల్లా బాలల సంరక్షణ విభాగం మరియు న్యాయ సేవా సంస్థలతో సమన్వయం ఏర్పరచబడినది. కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా అమలైన ఈ విధానం, విద్యార్థులకు సురక్షితమైన, బాలమిత్ర వాతావరణాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమం విస్తరించబడటం, కామారెడ్డి జిల్లా ఉత్తమ ఆచరణగా నిలిచినదని స్పష్టం చేస్తుందిజిల్లా కలెక్టర్ ఆశీష్ సంఘ్వాన్ చేతుల మీదుగా దత్తత కార్యక్రమం నిర్వహణ జిల్లాలో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బాల సాధనం నుండి ఒక చిన్నారిని దత్తతకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంఘ్వాన్ మాట్లాడుతూ, అనాథ మరియు పరిత్యజించిన పిల్లలకు కుటుంబ ప్రేమ, సంరక్షణ అందించడానికి దత్తత ఒక శ్రేష్ఠమైన మార్గమని తెలిపారు. దత్తత ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడినట్లు తెలిపారు. పిల్లల హక్కులు, భద్రత మరియు సంక్షేమం పరిరక్షణకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి ప్రమీల, జిల్లా సంక్షేమ అధికారి,ఐ.జీ. స్రవంతి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మరియు స్వామి డిసిపియు మరియు దత్తత తీసుకున్న తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రజలు దత్తతపై అవగాహన పెంచుకొని, అర్హత కలిగిన పిల్లలకు మంచి భవిష్యత్తు అందించడానికి ముందుకు రావాలని కలెక్టర్ ఆశీష్ సంఘ్వాన్ పిలుపునిచ్చారు.

## వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబునగర్, ఏప్రిల్ 30(ప్రజాదర్బార్):వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, తాపీ సబర్డినేట్ పోస్టులకు జిల్లా కలెక్టర్ కుష్బు గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి కారుణ్య నియామక అభ్యర్థులను రోస్టర్ ప్రకారం పారదర్శకంగా అర్హులైన 6 మంది జూనియర్ అసిస్టెంట్, 5 గురు ఆఫీస్ సబార్డినేట్ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జేఎల్ బి హరిప్రియ, డిఆర్ఓ రామ్ రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి సునీత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏవో జనార్ధన్, కలెక్టరేట్ ఏవో సువర్ణ రాజ్ లు పాల్గొన్నారు.

# లక్ష్యం పట్ల కట్టుబడి ఉంటే విజయం సులభం :జిల్లా కలెక్టర్

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన మైనారిటీ ప్రెసిడెంట్ పాఠశాలల విద్యార్థులకు సన్మానం



మహబూబునగర్ అర్బన్, ఏప్రిల్ 30(ప్రజాదర్బార్): నిర్దిష్టమైన లక్ష్యాన్ని మనసులో ఉంచుకొని కష్టపడి చదివితే, గమ్యాన్ని చేరుకోవడం సులభం అవుతుంది అని జిల్లా కలెక్టర్ కుష్బు గుప్తా పేర్కొన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తూ కలెక్టర్ ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ జిల్లాలోని 10 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు సాధించిన అద్భుతమైన ప్రగతిని కొనియాడారు.

ఫలితాల ముఖ్య అంశాలు: మొత్తం ఉత్తీర్ణత: జిల్లాలోని 10 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల నుండి మొత్తం 558 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 543 మంది (97 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు: జడ్చర్ల బాలికలు -1, మరియు మహబూబ్నగర్ బాలికలు-3

ఇతర పాఠశాలల ఫలితాలు:

మహబూబ్నగర్ గర్ల్స్-2.99 శాతం,
మహబూబ్ నగర్ గర్ల్స్-1.97 శాతం,
మహబూబ్నగర్ బాయ్స్-1ఽ2:96 శాతం.
మహబూబ్నగర్ బాయ్స్-3 :95 శాతం

విద్యార్థులకు ప్రోత్సాహం:
ఈ సందర్భంగా ప్రతి పాఠశాల నుండి ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం, ఆర్ ఎల్ సి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై ప్రోత్సాహం

కొడిపల్లి ఏప్రిల్....30: (ప్రజాదర్బార్లి) మండలం లోని కొట్టాల గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు , వ్యవసాయ శాఖ అధికారులు గురువారం సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ( పీ జే టీ ఎస్ ఏ యు)కు చెందిన సహాయ ప్రొఫెసర్లు డా. డి. కార్తిక్, డా. యు. మహేష్ పాల్గొన్నారు. మండల వ్యవసాయ అధికారిని స్వప్న జదవ్ , రైతులతో చర్చించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తల ముందుంచగా, వారు వాటికి సరైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ప్రొఫెసర్లు డా. డి. కార్తిక్, డా. యు. మహేష్ మాట్లాడుతూ పంటలలో సమతుల్య ఎరువుల వినియోగం అత్యంత అవసరమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం సూచించిన విత్తన రకాలనే ఉపయోగించాలని సూచించారు. అధికంగా యూరియా వాడటం వల్ల భూసార నష్టం జరుగుతుందని, కాబట్టి యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య పోషకాలు అందించే విధానాలను అనుసరించాలని రైతులకు సూచించారు. అలాగే ఒక్క పంటపై ఆధారపడకుండా పలు పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో సుస్థిర వ్యవసాయం కోసం సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రమేష్ వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు



# ప్రత్యేక అవసరాల పిల్లల కోసమే భవిత కేంద్రాలు

నెక్కొండ ప్రజాదర్బార్ ఏప్రిల్30:ప్రజా సంక్షేమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మండల విద్య శాఖ అధికారి భూక్యా రవి కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాల

పిల్లల గుర్తింపును చేపట్టిన మండల ప్రత్యేక ఉపాధ్యాయులు పొనకంటి అంజయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండల పరిధిలోని అమీన్ పేట గ్రామానికి చెందిన వల్ల సింహాద్రి లలిత దంపతుల కుమారుడు వల్ల గణేష్ కుమార్, గుండెంగ గ్రామానికి చెందిన బానోత్ సుధాకర్ వినోద దంపతుల కుమారుడు బానోతు శివ వారిద్దరు

పుట్టుకతో మానసిక సమస్యతో జన్మించారని, వారికి ప్రత్యేక శిక్షణ ఎక్కడ ఇస్తారో తెలియక ఇన్ని రోజులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి వారి ఇరువురిని గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి నెక్కొండ పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో నమోదు చేశామని తెలిపారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేకమైన దృష్టి సారిస్తుందని, వారి కోసమే భవిత కేంద్రాలు వెలిశాయని దివ్యాంగుల ఆత్మవిశ్వాసమే అసలైన విజయమని, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు.